# యాకోబు వ్రాసిన పత్రిక

అపొస్తులుడును, మహాభక్తుడైన యాకోబు ఈ పత్రికను వ్రాసాడు. క్రీస్తుని రక్షకునిగా అంగీకరించిన ప్రతి వ్యక్తి అనుసరించవలసిన పవిత్రభక్తి జీవితము గూర్చి నిస్సంకోచంగా ఈ పత్రికలో బోధించాడు. క్రియలు లేని విశ్వాసము మృతమని, ప్రతి విశ్వాసి లేఖనానుసారమైన భక్తిని తన జీవితములో కలిగి ఉండవలెనని తెలియజేసాడు. ఈ ప్రతికను క్రీ॥శ॥ 44-49 సం॥ల మధ్యకాలంలో వ్రాసియుండవచ్చును.

**యాకోబు వ్రాసిన పత్రిక-అనుక్రమణిక**

| అధ్యా. వచ | పాఠ్య సారాంశము |
|---|---|
| 1:1-11 | అభ్యసనీయమైన అనేక విషయములు |
| 1:12-27 | శోధనలో జీవకిరీటం |
| 2:1-13 | ధనికులు, దరిద్రులు-పరస్పర పరామర్శ |
| 2:14-26 | విశ్వాసము-క్రియలు |
| 3:1-12 | నాలుకను స్వాధీన మందుంచుకొనుట |
| 3:13-18 | దయ్యముల జ్ఞానము-దైవజ్ఞానము |
| 4:1-10 | పక్షములు-జగడములు |
| 4:11-17 | ధనవంతుల అతిశయము |
| 5:1-6 | దరిద్రుల యెడల ధనవంతుల క్రూరత్వము |
| 5:7-11 | సహనమును గూర్చిన హెచ్చరిక |
| 5:11-20 | ప్రార్థనా శక్తి |

# యాకోబు వ్రాసిన పత్రిక 1వ అధ్యాయము

## అభ్యాసనీయమైన అనేక విషయములు

దేవుని యొక్కయు ప్రభువైన యేసుక్రీస్తు దాసుడైన యాకోబు అన్యదేశములు యందు చెదిరియున్న పన్నెండు గోత్రములు వారికి శుభమని చెప్పి వ్రాయునది 2 నా సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగుపరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, 3 మీరు నానా విధములైన శోధనలలో పడునప్పుడు, అది మహానందమని ఎంచుకొనుడు 4 మీరు సంపూర్ణులును, అనాంగులును, ఏ విషయములోనైనను కొదువలేనివారునై యుండునట్లు ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడు 5 మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవరిని గద్దింపక అందరికిని దారాళముగ దయచేయువాడు. 6 అయితే అతడు ఏ మాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను సందేహించువాడు గాలిచేత రేపబడి ఎగిరిపడు సముద్ర తరంగమును పోలియుండును. 7 అట్టి మనుష్యుడు ద్విమనస్కుడై, తన సమస్త మార్గములయందు అస్థిరుడు, 8 గనుక ప్రభువు వలన తనకేమైనను దొరుకునని తలంచు కొనరాదు. 9 దీనుడైన సహోదరుడు తనకు కలిగిన ఉన్నతదశయందు అతిశయింప వలెను. ధనవంతుడైన సహోదరుడు తనకు కలిగిన దీనదశయందు అతిశయింపవలెను. 10 ఏలయనగా, ఇతడు గడ్డిపువ్వువలె గతించిపోవును. 11 సూర్యుడుదయించి, వడగాలి కొట్టి, గడ్డిని మాడ్చివేయగా దాని పువ్వురాలును, దాని స్వరూప సౌందర్యమును నశించును ఆలాగే ధనవంతుడును తన ప్రయత్నములలో వాడిపోవును.

## శోధనలో జీవకిరీటం

12 శోధన సహించువాడు ధన్యుడు అతడు శోధనకు నిలిచిన వాడై ప్రభువు తన్ను ప్రేమించువారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును. 13 దేవుడు కీడు విషయమై శోధింపబడనేరడు ఆయన ఎవనిని శోధింపడు గనుక ఎవడైనను శోధింపబడినప్పుడు – నేను దేవుని చేత శోధింపబడుచున్నానని అనకూడదు. 14 ప్రతివాడును తన స్వకీయమైన దురాశ చేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును. 15 దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును. 16 నా ప్రియ సహోదరులారా, మోసపోకుడి 17 శ్రేష్ఠమైన ప్రతి ఈవియు సంపూర్ణమైన ప్రతి వరమును, పరసంబంధమైనదై, జ్యోతిర్మయుడగు తండ్రియొద్ద నుండివచ్చును ఆయన యందు ఏ చంచలత్వమైనను గమనాగమనముల వలన కలుగు ఏ ఛాయయైనను లేదు. 18 ఆయన తాను సృష్టించిన వాటిలో మనము ప్రథమ ఫలముగా ఉండునట్లు సత్యవాక్యము వలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను.

19 నా ప్రియ సహోదరులారా, మీరీ సంగతి ఎరుగుదురు గనుక ప్రతి మనుష్యుడు వినుటకు వేగిరపడు వాడును, మాటలాడుటకు నిదానించు వాడును, కోపించుటకు నిదానించువాడునై యుండవలెను. 20 ఎందుకనగా నరుని కోపము దేవుని నీతిని నెరవేర్చదు. 21 అందుచేత సమస్త కల్మషమును, విజృంభించుచున్న దుష్టత్వమును మాని, లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి 22 మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చు కొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి 23 ఎవడైనను వాక్యమును వినువాడైయుండి దాని

ప్రకారము ప్రవర్తింపని వాడైతే, వాడు అద్దములో తన సహజముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు. 24 వాడు తన్ను చూచుకొని అవతలికి పోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవును గదా. 25 అయితే స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరి చూచి నిలుకడగా ఉండు వాడెవడో వాడు విని మరచువాడుకాక, క్రియను చేయువాడైయుండుతన క్రియలో ధన్యుడగును. 26 ఎవడైనను నోటికి కళ్లెము పెట్టుకొనక తన హృదయమును మోసరపచుకొనుచు భక్తిగల వాడనని అనుకొనిన యెడల వాని భక్తి వ్యర్థమే. 27 తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తి ఏదనగా– దిక్కులేని పిల్లలను విధవ రాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోక మాలిన్యము తన కంటకుండ తన్నుతాను కాపాడుకొనుటయునే.